క్లుప్తంగా

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న దుకాణదారులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని ప్రకాశం బజార్‌లో గల చిత్ర ఎలక్ట్రానిక్స్ పక్కన దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన దుకాణదారులు కోరారు. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 70 ఏళ్లుగా ప్రజలు నడుస్తున్న దారిని జయప్రకాష్ అనే వ్యక్తి ఆక్రమించి ప్రశ్నించిన తమను తిట్టడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు విచారణ చేసి దారిని కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ఇడుకుల్ల ప్రభాకర్, మంజుల, గట్టు శ్రీధర్, తడకమళ్ళ శ్యామ్, వనమా వాసు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



వీర రాఘవులు



భానుప్రకాష్‌గౌడ్

నల్లగొండ: పట్టణంలోని ఎస్‌టీయూ కార్యాలయంలో ఆదివారం ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనకంచి వీర రాఘవులు, ప్రధాన కార్యదర్శిగా తండు భానుప్రకాష్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.నరేందర్‌రెడ్డి, జి.విజయప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడిగా దత్తేశ్వర్, ఉపాధ్యక్షులుగా జాన్‌ఖాన్, బి.నాగేశ్వర్‌రావు, కె.లింగయ్య, మహిళా ఉపాధ్యక్షులుగా జి.ఉదయరాణి, సమీన, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్, కార్యదర్శులుగా పుట్ట శ్రీలత, ఆర్.లాలు, శంకరయ్య, హంస్మిత, ఫైనాన్స్ కమిటీ సభ్యులుగా వి.లాజర్, రేణుక, దేవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని పెద్దబండకు చెందిన జక్కుల మల్లేష్ రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమై కోమాలోకి వెళ్లాడు. కాగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్య చికిత్సకు సరిపడా డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలిసిన నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం మల్లేష్ కుటుంబ సభ్యులకు రూ.15,200 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్, మాదగోని కృష్ణ, రాఘవ్, జానీ, లింగయ్య, రత్నం, యాదగిరి, పృథ్వీ, దినేష్, మహేష్, బాబా, శంకర్, నరసింహ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి సన్మానం



బుచ్చిరెడ్డిని సన్మానిస్తున్న బాల చెలిమి సంపాదకులు

కనగల్: బాల సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిని ఆదివారం హైదరాబాదులో చిల్డ్రన్స్ అకాడమీ, బాల చెలిమి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బాల చెలిమి సంపాదకుడు వేదకుమార్, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్ సన్మానించారు. కార్యక్రమంలో భల్లా సరస్వతి, చొక్కాపు వెంకటరమణ, గరిపెల్లి అశోక్, పైడిమరి రామకృష్ణ, కేవీ కృష్ణారావు, బైతి దుర్గయ్య, మాచిరాజు కామేశ్వరరావు, పెందోట వెంకటేశ్వర్లు, అబ్దుల్ ఘని, ఉప్పల పద్మ, సమ్మెట విజయ, ఉమాదేవి, ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన రజితకు..

శాలిగౌరారం: ఇటీవల ప్రకటించిన గ్రూపు–2 ఫలితాల్లో 850వ ర్యాంకు సాధించి ఎంపీఓ ఉద్యోగం పొందిన మండలంలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన జాల రజితను.. ఆమె తల్లిగారి గ్రామమైన వల్లాల గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఉద్యోగులు, విద్యావంతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



జాల రజిత దంపతులను సన్మానిస్తున్న వల్లాల గ్రామస్తులు

తెగుళ్ల బారిన తెల్ల బంగారం

- వర్షాలకు చెట్లపైనే తడిసి ముద్దవుతున్న పత్తి
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



రాంరెడ్డిపల్లిలో ఎర్ర గుమ్మడి తెగులు సోకిన పత్తి పంట

మర్రిగూడ : రైతన్నలు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందేలోపే ఏదో ఒక కారణంగా దెబ్బతింటున్నాయి. వర్షాలు అధికంగా కురవడం, తెగుళ్ల బారిన పడడం వంటి కారణంతో పంట దిగుబడి తగ్గుతోంది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

అధిక వర్షపాతం నమోదు

మర్రిగూడ మండల వ్యాప్తంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురవాల్సిన దానికంటే అధికంగానే వర్షపాతం నమోదయింది. కానీ సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు బెట్టకు గురై తెగుళ్లు త్వరగా సోకాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో 29 శాతం, జూలైలో 78శాతం, ఆగస్టులో 56శాతం, సెప్టెంబర్ 69శాతం కురవాల్సిన దాని కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఎర్ర గుమ్మడి తెగులు సోకడంతో..

మర్రిగూడ మండల వ్యాప్తంగా పత్తి 22,100 ఎకరాలు, వరి 3,700 ఎకరాలు, కంది 40 ఎకరాలు, జొన్న 10 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి పంట సాగుకు ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అయినట్లు రైతులు చెబుతున్నారు. పత్తి చేలకు ఎర్ర గుమ్మడి తెగులు సోకడంతో మొదటి దశలోనే పత్తి పంటను పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పత్తితీతకు పరేషాన్..

ఇటీవల కురుస్తున్న వర్షాలు పత్తి రైతులను తీవ్ర నష్టపరుస్తున్నాయి. పత్తితీతకు అనుకూలంగా లేకపోవడంతో చెట్టుపైనే పత్తి తడిసి ముద్దయింది. తద్వారా నాణ్యత లోపిస్తుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అటు తెగుళ్లు సోకి.. ఇటు నాణ్యత లేక పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు వాపోతున్నారు.



రాంరెడ్డిపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

పత్తి చేనుకు తెగులు సోకింది



ఈ ఏడాది 8 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టాం. సకాలంలో వర్షాలు కురవకపోడంతో పత్తి పంట అంతా బెట్టకు గురైంది. అనంతరం కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి చేనుకు తెగులు సోకింది. ఉన్న పత్తి కూడా ఏరుకునే అవకాశం లేకుండా పోతోంది. నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– పంగ యాదయ్య, యరగండ్లపల్లి, రైతు

అధికారుల సూచనలు పాటించాలి



వాతావరణ మార్పుల్లో భాగంగా పత్తి పంటలకు మెగ్నీషియం లోపంతో ఎర్రగుమ్మడి తెగులు సోకింది. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పిచికారీ మందులు వాడాలి. ఈ ఏడాది మర్రిగూడ మండలంలో వరి సాగు తగ్గింది, పత్తి సాగు పెరిగింది.

– సాహస్, ఏఓ, మర్రిగూడ

బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నల్లగొండ టూటౌన్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో ఆదివారం తిప్పర్తి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండడంతో ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పోటీ చేసిన అన్ని స్థానాలను గెలుచుకొని కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కటికం సత్తయ్య గౌడ్, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, లొడంగి గోవర్దన్, ఊట్కూరు సందీప్‌రెడ్డి, తండు నరసింహ, కందుల లక్ష్మయ్య, వనపర్తి జ్యోతి, స్వరూప పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

శాలిగౌరారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో శాలిగౌరారం మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీకి చెందిన ప్రతిఒక్కరూ పనిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్ట వెంకట్‌రెడ్డి, గుండా శ్రీనివాసులు, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి

చిట్యాల: దసరా పండుగ సందర్భంగా చిట్యాల పట్టణంలో ఆదివారం అలయ్ బలయ్ కార్యక్రమాన్ని చిట్యాల ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోకల దేవదాసు, మారగోని ఆంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు, పొన్నం లక్ష్మయ్యగౌడ్, నారబోయిన శ్రీనివాస్, బొబ్బలి రాంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీలు గుండెబోయిన సైదులు, ఎద్దులపురి కృష్ణ, స్థానికులు పాటి నర్సిరెడ్డి, మూడ సుదర్శన్, బెల్లి సత్తయ్య, కుకుడాల గోవర్దన్, బహదూర్‌సింగ్, జిట్ట బొందయ్య పాల్గొన్నారు.

రేషన్ సంచుల పంపిణీకి ఎన్నికల ఎఫెక్ట్

గట్టుప్పల్ : ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేయాలనుకున్న రేషన్ బియ్యం సంచుల పంపిణీకి స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌తో బ్రేక్ పడింది. బియ్యం అందుకునే లబ్ధిదారులకు ఆరు కిలోల వరకు సంచుల ద్వారా అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతోపాటు ఐఎంజీ స్టాక్ పాయింట్లకు సంచులను సరఫరా చేసింది. కానీ ఎన్నికల షెడ్యూల్‌తో రేషన్ షాపులకు పంపిణీ చేయడం ఆగింది. కొన్ని షాపులకు సరఫరా చేసినప్పటికీ వినియోగదారులకు అందజేయడం ఆపాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సంచులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు, అభయ హస్తం, అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం అని ముద్రించారు. సంచులను ఎన్నికల అనంతరం అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారులకు అందజేయనున్న బియ్యం సంచి →



రేణుకా ఎల్లమ్మకు మొక్కుబడి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనగల్: మండలంలోని దర్వేశిపురం (పర్వతగిరి) శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల మొక్కుబడి కల్యాణాలను అర్చకులు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి చీర సారె, ఒడి బియ్యం, కట్న కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అంబటి నాగిరెడ్డి, ఆలయ సిబ్బంది కూసం ఉపేందర్‌రెడ్డి, నకిరేకంటి ఆంజనేయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లగొండ టూటౌన్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని ఆల్ఫా పబ్లిక్ స్కూల్‌లో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ హోటల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ఫా స్కూల్ కరస్పాండెంట్ బాదిని నరసింహ, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, లింగయ్య, రమావాణి, నసీం, శంకరయ్య, రవీందర్, అహ్మద్ అలీఖాన్, సురేష్‌రెడ్డి, ప్రసాద్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సందీప్, ప్రియాంక, ఉష, మహేష్, అనిల్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వీరయ్య, అశోక్‌రెడ్డి(ప్రస్తుత నల్లగొండ ఆర్డీఓ), నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డిలతోపాటూ పలువురు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.



శాలిగౌరారం: సమ్మేళనంలో పాల్గొన్న మాధారంకలాన్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

మార్కెట్ యార్డుకు పచ్చి ధాన్యం తీసుకురావొద్దు

శాలిగౌరారం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు పచ్చి ధాన్యం తీసుకురావొద్దని మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ అన్నారు. ఆదివారం ‘సాక్షి’ దినపత్రికలో ‘వరి కోతలకు ముందే కల్లాల కోసం పరుగులు’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. రైతులు మార్కెట్‌యార్డు ఆవరణలో కల్లాల కోసం ముందస్తుగా టార్పాలిన్ కవర్లు కప్పిపెట్టడం సరికాదన్నారు. రైతులు తమ ధాన్యాన్ని రాశులుగా మాత్రమే పోసుకోవాలని, పచ్చి ధాన్యాన్ని యార్డుకు తీసుకువచ్చి ఆరబోసుకునేందుకు వీలులేదన్నారు. 17 శాతం తేమ ఉండేవిధంగా బయటనే ధాన్యం ఆరబెట్టుకొని మార్కెట్ యార్డుకు తీసుకురావాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

చండూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం చండూరు పట్టణంలోని మాదగోని నర్సింహ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐకి బలమున్న అన్ని గ్రామాల్లో పోటీకి నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్, సహాయ కార్యదర్శి బొడ్డు వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తిప్పర్తి రాములు, నాయకులు బరిగల వెంకటేష్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఊషయ్య, రమేష్, సంజీవ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ నోబుల్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ రైల్వేస్టేషన్ పార్క్‌లో ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మందికి వైద్యులు డయాబెటిక్ పరీక్షలు, స్క్రీనింగ్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, వైస్ ప్రెసిడెంట్ వన్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా క్లబ్ సభ్యుడు చొగోని యాదగిరి సౌజన్యంతో మెడిసిన్ చదువుతున్న ఒక పేద విద్యార్థినికి రూ.10 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఏదుల అంజిరెడ్డి, తంతెనపల్లి సైదులు, యాస వెంకట్‌రెడ్డి, బుర్రి కృష్ణశేఖర్, మంచికంటి నాగేశ్వరరావు, బూర నరసయ్య, పజ్జూరి కరుణాకర్‌రెడ్డి, ములక నాగిరెడ్డి, చొగోని యాదగిరి, ముప్పిడి మల్లయ్య పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి పండుగ

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దేవత అయిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ రెండో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వేర్వేరుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



పెద్దమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్



హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలు

చిట్యాల: దసరా పండుగ సెలవులు పూర్తికావడంతో ఆదివారం విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగిపోయింది. చిట్యాల పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో సర్వీస్ రోడ్డు మీదుగా ట్రాఫిక్ మళ్లించారు. అయితే సర్వీస్ రోడ్డు ఇరుకుగా ఉండి రహదారిపై వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతుండడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సైతం వాహనాలు నెమ్మదిగా వెళుతుండడంతో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరగకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వీధుల్లో ప్రవహిస్తున్న కాలువ నీరు



నిర్మలానగర్ కాలనీలో సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న కాలువ నీరు (ఫైల్)

మండల కేంద్రంలోని నిర్మలానగర్ కాలనీలో డిస్ట్రిబ్యూటరీ కాలువ నీరు వీధుల్లో ప్రవహిస్తోంది. డిస్ట్రిబ్యూటరీ 40 కాలువకు ఉన్న సబ్ కెనాల్ పనులు పూర్తికాకపోవడంతో కాలువల ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు కాలనీలో సీసీ రోడ్ల మీదుగా నీరు ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. తిప్పర్తి

దారంతా బురద.. ప్రయాణం సాగేదెలా !



కేతేపల్లి - చెర్కుపల్లి రోడ్డులో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



కేతేపల్లి-కొండకిందిగూడెం గ్రామాల మధ్య బురదమయంగా ఉన్న మట్టి రోడ్డు

కేతేపల్లి: మండల కేంద్రం నుంచి చెర్కుపల్లి, కొండకిందిగూడెం గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లను ఏళ్లు గడిచినా బీటీ రోడ్లుగా మార్చడం లేదు. కేతేపల్లి నుంచి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉన్న ఈ రెండు మట్టి రోడ్లను బీటీగా మార్చాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఆయా గ్రామాల ప్రజలు కేతేపల్లి మండల కేంద్రానికి చేరుకోవడానికి ఈ రోడ్లు చాలా దగ్గరగా ఉంటాయి. మూడు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఈరోడ్ల మీదుగానే నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే ఈ రెండు రోడ్లు మట్టి రోడ్లు కావడంతో వర్షాకాలంలో ప్రయాణం చేయాలంటే కష్టతరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆయా రోడ్లు పూర్తిగా బురదమయం అయ్యాయి. గుంతల్లో నీరు నిలిచి, బురద పేరుకుపోవడంతో కాలి నడకన నడిచేందుకు కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు లింక్ రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి అదనంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా కావడంతోపాటు రవాణా ఖర్చుల భారం పెరుగుతోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి అత్యంత ప్రాధాన్యత కలిగిన రెండు రోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత



గట్టుప్పల్ మండల కేంద్రంలోని తేరట్‌పల్లి వెళ్లే దారిలో మూలమలుపు వద్ద ఏర్పడిన గుంత

గట్టుప్పల్ : మండల కేంద్రంలోని రైస్ మిల్లు ఎదురుగా మెయిన్ రోడ్డుపై గుంత ఏర్పడింది. ఈ ప్రదేశంలో మూలమలుపు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని మండలంలోని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.